
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 । కనిష్ఠం : 18.0
ANDHRAJYOTHY 5

జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు
శుక్రవారం 21 నవంబరు 2025

జిల్లాకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలి

- డీవైఎస్‌వో కృష్ణయ్య
- బాస్కెట్ బాల్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

ఘనంగా పాగుంట వెంకన్న కల్యాణం


స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

6

జీవితంలో బాల్యం మరువలేనిది

- అదనపు కలెక్టర్ నర్సింగరావు
- ముగిసిన బాలల హక్కుల వారోత్సవాలు


గద్వాల కలెక్టరేట్‌లో చిన్నారుల నృత్య ప్రదర్శన

6

అలంపూర్‌లో భక్తుల సందడి

- తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు
- స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు
- భక్తిశ్రద్ధలతో చండీహోమం

6


జోగుళాంబ ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న భక్తులు



మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, చిత్రంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డి, కలెక్టర్, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి

బాధితులకు న్యాయం చేయాలి

-నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి

నాగర్‌కర్నూల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో బాధితులకు సత్వర న్యాయం చేయాలని ఎంపీ డాక్టర్ మల్లు రవి అధికారులను ఆదేశించారు. గురువారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ(పీసీఆర్1955, పీవోఏ యాక్ట్ 1989) అమలుపై సమీక్షా సమావేశంలో కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ చిక్కుడు వంశీ కృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డి, విజిలెన్స్ కమిటీ సభ్యుల సమక్షంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లురవి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో విచారణ వేగంగా పూర్తి చేసి చార్జ్‌షీట్ వేసి బాధితులకు న్యాయంతో పాటు పరిహారం అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డిలు ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించిన వివరాలు, భూతగాదాలు బాధితుల నష్ట పరిహారం సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటికీ 234 ఎస్సీ, ఎస్టీ ఫిర్యాదులు అందగా అందులో 219 కేసులు అట్రాసిటీ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు వివరించారు. ఇప్పటి వరకు 219కేసులకు పరిహారం మంజూరు చేశామని, 19కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, డీఎస్పీ బుర్రి శ్రీనివాసులు, డీఆర్‌డీఏ పీడీ చిన్న ఓబలేష్, ఎస్సీ, ఎస్టీ కులాల నుంచి ప్రాతినిధ్యం సభ్యులు, జిల్లా లేబర్ అధికారి రాజ్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫిరంగి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ట్రైనీ విద్యార్థులతో అదనపు పనులు

- టీ-హబ్‌లో మరమ్మతుకు నోచుకోని బయో కెమిస్ట్రీ మిషన్
- వనపర్తి నుంచి మహబూబ్‌నగర్‌కు రక్త నమూనాలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు

6

'మామూళ్ల' శాఖలపై నజర్..!

- వ్యవస్థీకృతంగా మారిన అవినీతికి చెక్‌పెట్టే ఎత్తుగడ
- ఆ కోవలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దాడులు
- గతంలో రవాణా చెక్ పోస్టుల్లో తనిఖీలు చేసిన ఏసీబీ
- కేబినెట్‌లో తీర్మానం చేసి చెక్‌పోస్టులు ఎత్తివేసిన వైనం
- మరిన్ని శాఖలపై ఏసీబీ దృష్టి


వనపర్తి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ఏసీబీ అధికారుల తనిఖీలు (ఫైల్)

మహబూబ్‌నగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : సాధారణంగా ఫలానా అధికారి తమ పనిచేయాలంటే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఎవరైనా అవినీతి నిరోధకశాఖ అధికారులను సంప్రదిస్తే వారితో ప్లాన్ వేసి.. సదరు అధికారికి డబ్బులు ఇస్తుండగా కానీ, ఇచ్చిన తర్వాత కానీ పట్టుకుంటారు. కేసు నమోదు చేసి.. ఏసీబీ కోర్టులో సరెండర్ చేయిస్తారు. ఇది మనం ఇన్నాళ్లుగా చూస్తున్న, వింటున్న ఏసీబీ వ్యవహారం తీరు.. కానీ ఇప్పుడు ఏసీబీ తన పాత పంథాను కొనసాగిస్తూనే సరికొత్త అడుగులను వేస్తోంది. అవినీతి చేసిన అధికారులను మాత్రమే పట్టుకుంటే సరిపోదని, వ్యవస్థీకృతంగా మారిన అవినీతిని నివారించాలంటే దాని మూలాలను నిర్మూలించాలని భావిస్తోంది. ప్రభుత్వం నుంచి కూడా గోఎహెడ్ పాలసీ ఉండటంతో ఏసీబీ అధికారులు తమ పనిని విస్తృతం చేస్తున్నారు. ప్రభుత్వ మార్గదర్శకత్వంలో కొన్ని కీలక శాఖలపై దృష్టి సారిస్తున్నారు. సంబంధిత నివేదికలను తయారుచేసి ప్రభుత్వానికి అందించడం ద్వారా పాలసీ నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం కూడా వివిధ తనిఖీలకు అవినీతి నిరోధక శాఖలోని అధికారులను విశ్వసించి.. వినియోగిస్తోంది. ఒక్కొక్క శాఖలో వ్యవస్థీకృత అవినీతిపై దృష్టి సారిస్తోంది.

మొదటి దశలో జనబాహుళ్యంలో అవినీతి జరిగే శాఖలు అని పేరున్న వాటిపై నజర్ పెట్టింది. దీంతో ఆయా శాఖల్లో ఎప్పుడు ఎలాంటి దాడులు జరుగుతాయో.. ప్రభుత్వం ఎ లాంటి విధానపరమైన నిర్ణయం తీసుకుని తమ ఆదాయానికి గండి వేస్తుందోననే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే ఒక అవినీతి దారిని మూసివేస్తే పలు దారులు చూసుకునే అక్రమా ర్కులపై తర్వాత కూడా దృష్టి సారిస్తే ఫలితం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.


మహబూబ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

గురుకులాలతో మొదలు

ఏసీబీ కేవలం అవినీతి అధికారులను పట్టుకోవడమే కాకుండా తనిఖీలను విస్తృతం చేయడం గురుకుల పాఠశాలలతో మొదలైంది. ఉమ్మడి జిల్లాలో ఏసీబీ ఈ రెండేళ్లలో పదుల సంఖ్యలో అవినీతి అధికారులను పట్టుకున్నది. గురుకులాల్లో నాణ్యమైన భోజనం అందించకపోవడంతో తరచూ ఫుడ్‌పాయిజన్ కేసులు నమోదు అవుతున్నాయి. దీంతో సర్కారు ఏసీబీ అధికారులతో తనిఖీలు చేయించింది. వారు కూరగాయల నాణ్యత, వంట పదార్థాలు, హైజీన్ వాతావరణం సరిగా లేదని, నాసిరకం సరుకులు వాడుతున్నారని రిపోర్టు ఇచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌కొండ గురుకులంలో కూడా ఇదే పరిస్థితి కనిపించింది. దీనికి కారణం మెస్ చార్జీలు చాలకపోవడం అని తెలిశాక.. ప్రభుత్వం ఆ చార్జీలను పెంచింది. 3 తరగతి నుంచి 7వ తరగతి వరకు రూ. 950గా ఉంటే రూ. 1330కి, 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు రూ. 1100 ఉంటే రూ. 1540కి, ఇంటర్మీడియట్ నుంచి పీజీ వరకు రూ. 1500 ఉంటే రూ. 2100లకు పెంచింది. 2024 ఆగస్టులో ఏసీబీ తనిఖీలు చేసి నివేదిక ఇచ్చిన తర్వాత అదే సంవత్సరం నవంబరులో 40 శాతం డైట్ చార్జీలను ప్రభుత్వం పెంచింది. అలాగే కాస్మొటిక్ చార్జీలను 200 శాతం పెంచింది. ఏసీబీకి ఇస్తే కచ్చితమైన నివేదికలు వస్తాయని భావించిన ప్రభుత్వం ఈ విధంగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

ఆర్టీఏ చెక్‌పోస్టుల మూసివేత

రవాణాశాఖ చెక్ పోస్టుల్లో అవినీతిపై గత సంవత్సరమే దృష్టి సారించిన ప్రభుత్వం.. వ్యవస్థీకృత అవినీతిని అరికట్టే బాధ్యతను ఏసీబీకి అప్పగించింది. 2024 మే, జూన్ నెలల్లో ఒకసారి రూ. 2.70లక్షలు, మరోసారి రూ. 1.92 లక్షలు, లెక్కల్లోకి

(మిగతా 6లో..)

తేమ పేరుతో ఇబ్బంది పెట్టొద్దు

- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- అధికారులు కొనుగోలు కేంద్రాలను పరిశీలించాలి
- ధాన్యం అమ్మిన రైతులకు వెంటనే రశీదు ఇవ్వాలి
- కుడికిల్ల, నార్లాపూర్‌లలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మంత్రి


కుడికిల్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి

కొల్లాపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాలలో తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులకు సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని కుడికిల్ల, నార్లాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం 17 శాతం తేమ ఉన్న రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బంది పెట్టవద్దని కొనుగోలుదారులకు సూచించారు. సంబంధిత అధికారులు ప్రతీ రోజు కొనుగోలు కేంద్రాలను పరిశీలించాలని, ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ధాన్యాన్ని విక్రయించిన వెంటనే రైతులకు రశీదు ఇవ్వాలని సూచించారు. రైతులు తమ ధాన్యాన్ని దళారులకు కాకుండా, కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. మంత్రి వెంట సింగిల్‌విండో మాజీ చైర్మన్ జూపల్లి రఘుపతిరావు, మాజీ జడ్పీటీసీ హనుమంత్ నాయక్, సింగిల్ విండో డైరెక్టర్ పసుపుల నరసింహ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రతకే ప్రాధాన్యం

-ఎస్‌సీఈఆర్‌టీ డిప్యూటీ డైరెక్టర్ రేవతిరెడ్డి


తాడూరు జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ రేవతిరెడ్డి

నాగర్‌కర్నూల్/తాడూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని (ఎస్‌సీఈఆర్‌టీ) అదనపు సంచాలకులు, జిల్లా పరిశీలకురాలు రేవతిరెడ్డి అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో జిల్లాలోని ఎంఈవోలు, కాంప్లెక్స్ పాఠశాల, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, కేజీబీవీల ప్రత్యేక అధికారులతో పాఠశాలల పరిశుభ్రత స్పెషల్ క్యాంపెయిన్ 5.0పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు మెరుగైన బోధనతోపాటు భద్రతను కల్పించాలని ఆదేశించారు. రెండు రోజులుగా జిల్లాలో పలు పాఠశాలల్లో పర్యటించి గుర్తించిన సమస్యలను పరిష్కరించి నివేదికలు అందజేయాలని ఎంఈవోలను ఆదేశించారు. పాఠశాలల్లో పరిశుభ్ర వాతావరణం కల్పించాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. అదేవిధంగా తాడూరు జడ్పీహెచ్‌ఎస్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో బోధన విధానం, విద్యార్థుల హాజరు శాతం, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఈవో రమేశ్ కుమార్, ఏఎంవో షర్ఫుద్దీన్, సీఎంవో వెంకటయ్య, కేజీబీవీల పర్యవేక్షణ అధికారిణి శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



వృద్ధిలో మత్స్య సంపద

- మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో జిల్లాలో చేపపిల్లల ఉత్పత్తి కేంద్రానికి సన్నాహాలు
- నేడు ప్రపంచ మత్స్య దినోత్సవం

7



నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలి

- 8వ బెటాలియన్ కమాండెంట్ ఆఫీసర్ కల్నల్ ఎస్.కె.సింగ్

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- కుటుంబ కలహాలతో అఘాయిత్యం

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):కుటుంబ కలహాలతో శంకర్‌గౌడ్ అనే వ్యక్తి నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి క్యాంపు కార్యాలయం ముందు గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బిజినేపల్లి మండలం లింగసానిపల్లి గ్రామానికి చెందిన శంకర్‌గౌడ్ తాను కొనుగోలు చేసిన 5 గుంటల భూమిని తన వ్యక్తిగత అవసరాల కోసం అమ్ముకుంటుండగా తన అన్న భూపతిగౌడ్, అతని సమీప బంధువు బాలగౌడ్ అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను కొనుగోలు చేసిన భూమిని అమ్మకుండా ఎమ్మెల్యే వద్దన్నారని ఎమ్మార్వో కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయకుండా అడ్డుపడుతున్నాడని ఆరోపించారు. ఈ విషయంపై తాము అడుగుదామని వెళితే ఎమ్మెల్యే అందుబాటులో లేరని మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బాధితుడి భార్య సుజాత తెలిపారు. దీంతో క్యాంపు కార్యాలయంలో ఉన్నవారు బాధితుడిని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న శంకర్‌గౌడ్‌ను ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నది.

యువత మత్తులోకి..!

విచ్చలవిడిగా హాబిట్ ఫార్మింగ్ మందుల విక్రయాలు

- లైసెన్స్ లేని అసోసియేషన్‌లపై నామమాత్రపు చర్యలు
- నిషేధిత మందులతో జోరుగా దందా
- పట్టించుకోని సంబంధిత అధికారులు

గద్వాల క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో కొన్ని మెడికల్‌షాప్‌ల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నిషేధిత మందులను విక్రయిస్తున్నారని, జీఎస్టీ కూడా తగ్గించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కాని పరిస్థితి నెలకొన్నది.

మత్తులోకి యువత..

జిల్లాలోని పలు మెడికల్ దుకాణాల యజమానులు యువతను మత్తును అలవాటు చేస్తూ వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. ముఖ్యంగా హాబిట్ ఫార్మింగ్ అనే మందులు మత్తునిస్తాయి. వీటిని ఎవరైనా ఒక్క సారి వాడితే అవి మళ్లీమళ్లీ వాడాలనిపిస్తోంది. వీటి వాడకం అంతగా ఉండదు.. తప్పనిసరి అయితే డాక్టర్ ప్రిస్కిప్షన్ ఉంటేనే ఈ మందులు ఇవ్వాల్సి ఉంది. కానీ కొందరు మెడికల్ దుకాణాల యజమానులు కాసుల కక్కుర్తి పడి విచ్చలవిడిగా విక్రయిస్తు సమాచారం. అధికారుల కూడా నామ మాత్రపు పర్యవేక్షణ చేయడంతో ఈ దందా ఇష్టారాజ్యంగా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా మందులపై కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది సెప్టెంబరు 22న జీఎస్టీని 11 శాతం తగ్గించిన విషయం తెలిసిందే. అయితే జిల్లాలోని మెడికల్ దుకాణాల యజమానులు మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.


హెచ్, హెచ్ 1 మందుల అమ్మకాలు

నిషేధిత మందుల జాబితాలో హెచ్, హెచ్ 1 కంపెనీలు ఉన్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. అవసరమైతే వీటిని డాక్టర్ ప్రిస్కిప్షన్‌తోనే ఇవ్వాల్సి ఉంది. హెచ్ కంపెనీకి సంబంధించి 300 రకాల మందులు, హెచ్1కు సంబంధించి 50 రకాల మందులు నిషేధిత జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. కాని వీటిని జిల్లాలోని కొన్ని మెడికల్ షాపులలో విచ్చలవిడిగా విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.


గద్వాలలో మెడికల్‌షాప్‌ను తనిఖీ చేస్తున్న అధికారి(ఫైల్)

జోగుళాంబ గద్వాల జిల్లాలో మొత్తం 510 రిజిస్ట్రేషన్ చేసుకున్న మెడికల్ దుకాణాలు, మెడికల్ ఏజెన్సీలు ఉన్నాయి. ఇందులో 430 మెడికల్ దుకాణాలు ఉండగా 90 అసోసియేషన్ దుకాణాలు ఉన్నట్లు సమాచారం. కొన్ని రిజిస్ట్రేషన్ లేని ఏజెన్సీల వల్లే ఎక్కువ సంఖ్యలో మెడికల్ దుకాణాలకు నిషేధిత మందులు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని రిజిస్ట్రేషన్ ఉన్నవారు కూడా కాసులకు కక్కుర్తిపడి వీటిని అధిక ధరలకు మెడికల్ షాప్‌లకు విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

ఇప్పటికే 10 కేసులు నమోదు చేశాం



జోగుళాంబ గద్వాల జిల్లాలో అనుమతులు లేకుండా మందులు విక్రయిస్తున్న వారిపై 10 కేసులు నమోదు చేశాం. రిజిస్ట్రేషన్ చేయించుకోని వాటిపై, డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా అమ్మకాలు సాగిస్తున్న మెడికల్ దుకాణాలను గుర్తించి కేసులు నమోదు చేస్తాం.

- డాక్టర్ వినయ్, జిల్లా డ్రగ్ అధికారి, గద్వాల


ఆవంచ గ్రామంలో రైతు నిప్పంటించిన పత్తి పంట

పత్తి చేనుకు నిప్పు పెట్టిన రైతు

తిమ్మాజిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పెట్టుబడి రావడంలేదని రైతు సురేందర్‌రెడ్డి తన పత్తిపంటకు నిప్పు పెట్టిన ఘటన గురువారం నాగర్‌కర్నూలు జిల్లా తిమ్మాజిపేట మండలం ఆవంచ గ్రామంలో చోటుచేసుకున్నది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తాను అప్పు చేసి 9 ఎకరాల్లో పత్తి పంటను వేశానని, పత్తి పంట ఏపుగా పెరిగి కాయలు బాగానే వచ్చినా అధిక వర్షాలతో పంట ఎరుపెక్కిందన్నారు. వచ్చిన దిగుబడితో ప్రైవేట్ అప్పులు, పురుగుల మందుల బకాయిలు తీర్చలేని పరిస్థితి అని ఆవేదన వ్యక్తం చేశారు. 6 ఎకరాల పత్తి తీశానని, మిగతా మూడు ఎకరాల్లో పత్తి తీయడానికి కూలీల కొరత ఏర్పడిందని, ఆ పత్తి తీసినా కూలీలకు కూడా సరిపడా డబ్బులు రావని దిక్కుతోచని స్థితిలో పంటకు నిప్పు పెట్టానన్నారు. చుట్టుపక్కల రైతులు తమ పశువులనైనా మేపుకుంటామని, కాల్చడం ద్వారా ఏమి లాభమని సూచించారన్నారు.

విద్యార్థిలోకం చైతన్యం కావాలి

- అసిస్టెంట్ ప్రొఫెసర్ బైరెడ్డి సతీశ్
- ఘనంగా పీడీఎస్‌యూ జిల్లా మహాసభలు



పాలమూరులో ర్యాలీ నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పాలకవర్గాల దోపిడీ, మతోన్మాద, ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థిలోకం చైతన్యం కావాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ బైరెడ్డి సతీశ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో గురువారం పీడీఎస్‌యూ జిల్లా 16వ మహాసభలను ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు న్యూటౌన్‌లోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్ నుంచి బస్‌స్టాండ్, అంబేడ్కర్ చౌరస్తాల మీదుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాభవన్ ముందు యూనియన్ జెండాను ఆవిష్కరించి, సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా బైరెడ్డి సతీశ్ మాట్లాడుతూ పాలకవర్గాలు అవలంభిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నారాయణమ్మ మాట్లాడుతూ హక్కులను కాపాడుకునేందుకు మహిళల్లో చైతన్యం రావాలన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీ, రాష్ట్ర కార్యదర్శి అనిల్, మాజీ అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాభిప్రాయానికి భిన్నమైన పాలన కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాంచందర్, టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్, జిల్లా అధ్యక్షుడు సాంబశివుడు, న్యాయవాది మణ్యం, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి సీతారాం, ఉపాధ్యక్షుడు మధుసూదన్, సంజీవ్, రాజేశ్, వెంకటేశ్, తిరుమలేశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాగుంట వెంకన్న కల్యాణం



స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో నిలుచున్న భక్తులు

కేటీదొడ్డి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం సమీపంలో ఉన్న కొండపై వెలసిన పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం అమావాస్య సందర్భంగా అర్చకులు, ఆలయ పెద్దలు స్వామివారి కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. వేకువజామునే స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు జరిపించి పట్టు వస్త్రాలు ధరించి పుష్పాలతో అలంకరించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలతో భక్తులతో కలిసి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఉత్సవ విగ్రహాలను ఆలయ ప్రాంగణంలోకి తీసుకువచ్చి భక్తుల సమక్షంలో కల్యాణాన్ని అర్చకులు ఘనంగా జరిపించారు. భక్తులు తమ వాహనాలకు పూజలు చేయించారు.

జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలి

- డీవైఎస్‌వో కృష్ణయ్య
- బాస్కెట్ బాల్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో వ్యాయామ ఉపాధ్యాయులు

గద్వాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించి జిల్లా మంచి పేరు ప్రతిష్టలు తీసుకరావాలని డీవైఎస్‌వో కృష్ణయ్య క్రీడాకారులకు సూచించారు. గురువారం ఓ ప్రైవేటు పాఠశాల ఆవరణలో ఉమ్మడి జిల్లా అండర్ -17 బాస్కెట్ బాల్ జట్టును బాలికలు, బాలురకు వేర్వేరుగా ఎంపిక చేశారు. త్వరలో కరీంనగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటారు. జిల్లా జట్టు ఎంపికకు ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 200మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారి ఆట పనితీరుని బట్టి వ్యాయామ ఉపాధ్యాయులు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ... ఎంపికైన క్రీడాకారులు తమ ఆటతీరును ఉత్తమంగా కనబరిచి జిల్లాకు పేరును తీసుకరావాలని కోరారు. క్రీడాకారులకు క్రీడలు శారీరక మానసిక వికాసాభివృద్ధికి తోడ్పడుతాయని వివరించారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి డాక్టర్ తోట శ్రీనివాసులు, పాఠశాల డైరెక్టర్ రాము, వ్యాయామ ఉపాధ్యాయులు హైమావతి, బీసన్న, నాగేష్, మోహనమురళీ, సతీష్, నర్సింహారాజు, మల్లేశ్వరి, స్వాతి, దేవేందర్ నాయుడు, నాగరాజు, రాఘవేంద్ర, పరూక్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు బీసీ-ఏ సర్టిఫికెట్లు ఇవ్వాలి

- మత్స్యకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బయ్య వెంకటస్వామి



పెద్దకొత్తపల్లిలో మత్స్యకారుల సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న చేస్తున్న సంఘం రాష్ట్ర నాయకులు

పెద్దకొత్తపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులకు బీసీ-ఏ సర్టిఫికెట్లు ఇవ్వాలని మత్స్యకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బయ్య వెంకటస్వామి డిమాండ్ చేశారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 21వ తేదీన నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ పట్టణంలో బహిరంగసభ నిర్వహించారు. సభకు సంబంధించిన కరపత్రాలను గురువారం పెద్దకొత్తపల్లిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న చెరువుల్లో చేప పిల్లలను వదలాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా మత్స్యకారులు అధిక సంఖ్యలో తరలివచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బాషమోని సైదులు, ఎల్లయ్య, మల్లయ్య, గట్టు ఆంజనేయులు, పుట్ట ఆంజనేయులు, బి.రాముడు, పెబ్బేటి రామస్వామి, మల్లేశ్, బాల నారాయణ, చెన్నయ్య పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు దాతల సహకారం

- ప్రతీ రోజు రాత్రి మాలధారులకు అల్పాహారం
- అందిస్తున్న అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి
- ఈ నెల 5 నుంచి వచ్చేనెల 28 వరకు కొనసాగింపు



స్వామి వారికి పూజ చేస్తున్న అయ్యప్ప స్వాములు



అల్పాహారం స్వీకరిస్తున్న అయ్యప్ప స్వాములు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ సంవత్సరం కార్తీక మాసంలో లక్షలాదిమంది భక్తులు అయ్యప్ప మాల ధరిస్తారు. 41 రోజుల పాటు నియమ నిష్ఠలతో దీక్షలు కొనసాగిస్తున్నారు. ప్రతీ రోజు మధ్యాహ్నం పాలమూరు నగరంలోని స్వాములతో పాటు, ఇతర ప్రాంతాల నుంచి వివిధ పనుల మీద వచ్చే స్వాములు స్థానికంగా నిర్వహించే పూజల్లో పాల్గొని అక్కడే భిక్ష (మధ్యాహ్న భోజనం) స్వీకరిస్తారు. అయితే వారికి రాత్రి వేళ అల్పాహారం (సద్ది) అందుబాటులో లేక ఇబ్బంది పడుతుంటారు. ఈ విషయాన్ని గమనించిన అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి గత ఏడాది నుంచి దాతల సహకారంతో అయ్యప్ప స్వాములకు అల్పాహారం అందిస్తున్నారు.

దాతల సహకారంతో నిర్వహణ

మహబూబ్‌నగర్ పట్టణంలోని అశోక్ టాకీస్ చౌరస్తాలో అమావాస్య అన్నదాన కేంద్రంలో ఈ నెల 5న ప్రారంభమైన అల్పాహార వితరణ వచ్చేనెల 28 వరకు కొనసాగుతుంది. కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగించేందుకు దాతలు నిర్వాహకులకు విరాళాలను అందిస్తున్నారు. అల్పాహార వితరణకు స్థానిక అయ్యప్ప స్వాములతో పాటు, వీహెచ్‌పీ, భజరంగదళ్ కార్యకర్తలు, భజన మండలి సభ్యులు సహకారం అందిస్తున్నారు.

వితరణ ప్రారంభమైన రోజు 100 మం దికి పైగా స్వాములు అల్పాహారం స్వీకరించారు. వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇలా ఎంత మంది స్వాములు వచ్చినా ఇబ్బంది లేకుండా అల్పాహారం అందించేందుకు నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసుకున్నారు.

ఎంతమంది స్వాములకైనా అల్పాహారం



అమావాస్య అన్నదాన కేంద్రంలో అయ్యప్ప స్వాములకు రోజుకో రకమైన అల్పాహారంతో పాటు స్వీటు ఇస్తున్నాం. ఉదయం వేళ కాఫీ, టీ కూడా అందిస్తున్నాం. ఆ సమయంలోనే టోకెన్లు ఇస్తాం. వాటి ఆధారంగా అల్పాహారాన్ని సిద్ధం చేస్తాం. మాలధారులు ఎంతమంది వచ్చినా ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశాం.

- సీమ నరేందర్,
అఖిల భారత అయ్యప్పదీక్ష ప్రచార సమితి అధ్యక్షుడు

నాలుగు సంవత్సరాలుగా..



దాతల సహకారంతో, అమావాస్య అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో నాలుగు సంవత్సరాలుగా ప్రతీ అమావాస్య రోజు అన్నదానం చేస్తున్నాం. దీంతో పాటు గత ఏడాది నుంచి 41 రోజుల పాటు అయ్యప్ప స్వాములకు రాత్రి వేళలో అల్పాహారాన్ని అందిస్తున్నాం.

- రఘురాం గౌడ్,
అమావాస్య అన్నదాన కమిటీ అధ్యక్షుడు

సామాజిక కార్యక్రమాలు



అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు, పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఈ సంవత్సరం తొలిసారిగా అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించాం. ఇకపై ప్రతి సంవత్సరం కొనసాగిస్తాం.

- రమేశ్, గురుస్వామి

ట్రైనీ విద్యార్థులతో అదనపు పనులు

- మహబూబ్‌నగర్‌కు రక్త నమూనాల శాంపిల్స్
- టీహబ్‌లో చెడిపోయిన బయో కెమిస్ట్రీ మిషన్
- ఒక్కరోజే పంపించాం : టీహబ్ మేనేజర్



వనపర్తిలోని టీహబ్ కేంద్రం

వనపర్తి వైద్యవిభాగం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైద్య పరీక్షల నిర్వహణలో పని నేర్చుకోవడానికి వస్తున్న ఒకేషనల్ విద్యార్థులకు అదనపు పనిభారం మోపుతున్నారు. బస్సు చార్జీలను తగ్గించేందుకు బాలికలను (ట్రైనర్లు) ఉపయోగిస్తున్నారు. ఈ పరిస్థితి వనపర్తి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంటున్నది. ఇందుకు టీహబ్‌లోని బయో కెమిస్ట్రీ మిషన్ మరమ్మతులకు గురి కావడమే ప్రధాన కారణం. టీహబ్‌లో గల బయో కెమిస్ట్రీ యంత్రం యొక్క వైర్లను ఎలుకలు కొరికాయని, దీంతో గత రెండు నెలలకు పైగా యంత్రం పని చేయకుండా మరుగున పడింది. అధికారులు టీహబ్‌కు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, జనరల్ ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రాల నుంచి వస్తున్న రక్త నమూనాలను వైద్య పరీక్షల నిమిత్తం మహబూబ్‌నగర్‌కు పంపించి రిపోర్టులు తెప్పిస్తున్నారు. అందుకోసం టీహబ్‌కు ట్రైనింగ్ కోసం వస్తున్న విద్యార్థుల చేత పని చేయించుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

రోజూ 400 వరకు శాంపిల్స్...

విద్య నేర్చుకోవడానికి టీహబ్‌కు వస్తున్న విద్యార్థులు ప్రతీ రోజు ఉదయం 7 గంటలకే టీహబ్‌కు చేరుకుని దాదాపు 400 వరకు శాంపిల్స్‌ను తీసుకుని మహబూబ్‌నగర్ పయనమవుతున్నారు. వారిలో బాలికలే వెళుతున్నారు. బాలికలే వెళ్లటానికి ఆర్టీసీ ఉచిత బస్సులు మరో ఉదాహరణగా చెప్పాలి. పురుషులను పంపిస్తే చార్జీల ఖర్చు అవుతుందని బాలికల చేతికి శాంపిల్స్ అందజేసి మహబూబ్‌నగర్ టీహబ్‌కు పంపిస్తున్నారు. ఇటీవలే పాఠశాల బుక్స్ తీసుకురావడానికి వెళ్లిన కొందరు విద్యార్థులు వాహనం బోల్తా పడ టంతో గాయాలపాలైన సంఘనట మనం చూ శాం. అలాంటి పొరపాట్లు జరగకుండా ఉండా లంటే ఎవరు చేయాల్సిన పనిని వారితోనే చేయించే బాధ్యత అధికారులపై ఉంటుంది. అలాంటి అధికారులు చెప్పిన మాట వినకపోతే భయభ్రాంతులకు గురి చేస్తున్నారని కూడా విశ్వసనీయ సమాచారం.

దీనిపై వివరణ కోసం టీహబ్ మేనేజర్‌ను సంప్రదించగా... కేవలం ఈ ఒక్కరోజే పంపించామని, అది కూడా క్యాలిబ్రేటర్స్ రిపోర్టు కోసం వెళ్లారని, మరోసారి ఇలా జరగకుండా చూసుకుంటామని తెలిపారు.

అలంపూర్‌లో భక్తుల సందడి

- తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు
- స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు
- భక్తిశ్రద్ధలతో చండీహోమం



స్వామి, అమ్మవారి ఆలయాల ముందు కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



తుంగభద్ర నదిలో పుణ్య స్నానాలు చేస్తున్న మహిళలు

అలంపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్ క్షేత్రం గురువారం భక్తజనంతో సందడిగా మారింది. కార్తీకమాసం చివరి రోజు, అమావాస్య సందర్భంగా వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ముందుగా తుంగభద్ర పుష్కరఘాట్‌లో పుణ్యస్నానాలు ఆచరించి, నదిలో దీపాలు వదిలారు. అనంతరం జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయాల ముందు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి సన్నిధిలో కుంకు మార్చనలు చేశారు. యాగమండపంలో నిర్వహించిన చండీహోమంలో పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణకు కంకణబద్ధులు కావాలి

- ఆధ్యాత్మిక ధర్మ ప్రచారకులు రఘోత్తమాచారి



సమావేశంలో మాట్లాడుతున్న అంతర్జాతీయ యోగా, ఆధ్యాత్మిక ధర్మ ప్రచారకుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు రఘోత్తమాచారీ

మక్తల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : హిందూ ధర్మ పరిరక్షణకు మహిళలు కంకణబద్ధులు కావాలని అంతర్జాతీయ యోగా నిపుణుడు, ఆధ్యాత్మిక ధర్మ ప్రచారకుడు రఘోత్తమాచారీ అన్నారు. మక్తల్‌పట్టణంలోని ఉమామహేశ్వరాలయంలో గురువారం నిర్వహించిన 33,333 దీపార్చన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమాజంలో మార్పు కోసం జ్ఞానపీఠం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత దీపారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు కొండయ్య, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, నాయకులు కోళ్ల వెంకటేశ్, కట్ట సురేశ్, కిరాణా అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్, ఆలయ అధ్యక్షుడు ఆంజనేయులు, చిన్న కృష్ణయ్య, చిట్యాల ఆంజనేయులు, అనంతకుమార్, నాగరాజు, పాపిరెడ్డి, నవీన్, అరుణ్ పాల్గొన్నారు.

పత్తి రైతుల సమస్యలు పరిష్కరించాలి

- ఎంపీ మల్లు రవికి వినతి

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పత్తి రైతుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ వద్ద ఎంపీ మల్లు రవికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎం.శ్రీనివాసులు మాట్లాడుతూ సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. తేమశాతం ఎక్కువగా ఉందని, కాయ పక్వానికి రాలేదని సాకులు చెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కిసాన్ కపాస్ యాప్‌తో రైతులకు అవగాహన లేక నష్టపోతున్నారని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆయన వెంట తెలంగాణ రైతు సంఘం నాయకులు నాగరాజుగౌడ్, శివరాం, కురుమయ్య పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ఎంపీ మల్లు రవికి వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ రైతు సంఘం నాయకులు

'మామూళ్ల' శాఖలపై నజర్..!



గత సంవత్సరం ఆగస్టు 13న కోయిల్‌కొండ బీసీ గురుకులంలో ఏసీబీ తనిఖీలు (ఫైల్)

(5వ పేజీ తరువాయి)

రాని నగదును సీజ్ చేశారు. ఈ అవినీతి పరిణామాలపై ప్రభుత్వానికి ఏసీబీ నివేదిక ఇవ్వగా.. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టులో జరిగిన కేబినెట్ సమావేశంలో ఆర్టీవో చెక్‌పోస్టులను ఎత్తివేస్తూ తీర్మానం చేసింది. అయితే ఆ తర్వాత కూడా కొద్ది రోజులు కొనసాగగా.. అక్టోబర్ 18, 19 తేదీల్లో కూడా చెక్‌పోస్టుల్లో ఏసీబీతో మరోసారి తనిఖీలు చేయించారు. ఆ సమయంలో గద్వాల జిల్లాలోని జల్లాపురం వద్ద, నారాయణపేట జిల్లా కృష్ణా వద్ద తనిఖీలు చేయగా.. రాష్ట్రవ్యాప్త తనిఖీల్లో రూ. 74 లక్షలు లెక్కల్లోకి రాని నగదు దొరికింది. దీంతో రవాణాశాఖ చెక్‌పోస్టులను ఎత్తివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనివల్ల చెక్‌పోస్టుల్లో అవినీతికి చెక్ పడింది. అయితే ఇంకా ఆర్టీవో కార్యాలయాల వద్ద ఉన్న ఏజెంట్లు, వారి వద్ద నుంచి వసూళ్లపై, మొబైల్ చెకింగ్ వాహనాల ద్వారా జరుగుతున్న దోపిడీపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఇప్పుడు ఎస్‌ఆర్‌వోల వంతు

పై రెండింటి నివేదికలతో ఎంతో కొంత మార్పురాగా.. ప్రస్తుతం ఏసీబీ ఫోకస్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై పడింది. ఇక్కడ కూడా వ్యవస్థీకృత అవినీతికి కొదువ లేదు. డాక్యుమెంట్ చేయాలంటే ఇంత చార్జ్ అని వసూలు చేసేవారు.. డాక్యుమెంట్ రైటర్ల మాటున అడ్డగోలు డబ్బులు వసూలు చేయడం, దానికి కట్టడి లేకపోవడం.. అందులో కొంత మొత్తం అధికారులకు ఇవ్వడం షరా మామూలే.. ఇటీవల వనపర్తి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో దాడులు చేయగా.. డాక్యుమెంట్ రైటర్లు ఎక్కువగా ఉండటం, అనధికారిక వ్యక్తుల సంచారం ఉండటాన్ని గమనించారు. ఫోన్‌లు, ఇతర టెక్నికల్ డేటాను తీసుకున్నారు. వాటి నుంచి సేకరించిన సమాచారం ద్వారా ఎలాంటి అవినీతి జరుగుతుందో తెలుసుకుని ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. వనపర్తితో పాటు మరికొన్ని చోట్లా అదేరోజు దాడులు చేశారు. ఈ నివేదిక అందిన తర్వాత ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో ఎదురుచూడాలి. దీంతోపాటు మరికొన్ని 'మామూళ్ల' శాఖలపై కూడా దృష్టి సారించే అవకాశం ఉంది.

జీవితంలో బాల్యం మరువలేనిది

- అదనపు కలెక్టర్ నర్సింగరావు
- ముగిసిన బాలల హక్కుల వారోత్సవాలు

గద్వాల న్యూటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరి జీవితంలో బాల్యదశ మరువరానిదని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలల హక్కుల వారోత్సవాలు ముగింపు గురువారం గద్వాల ఐడీవోసీ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ నర్సింగరావు హాజరై మాట్లాడారు. చదువుకోవడం బాలల హక్కు అని, బడి మానేసిన పిల్లలందరిని పాఠశాలలో చదువుకునేలా బాధ్యత తీసుకోవాలన్నారు. నేడు చాలాచోట్ల కొంతమంది చిన్నపిల్లలు రకరకాల వేధింపులకు గురవౌతున్నారని, వారి హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా మొదట తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా చైల్డ్ హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నెంబర్ 1098కు సంబంధించిన పోస్టరు విడుదల చేశారు. అనంతరం చిన్నారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఆటల పోటీల్లో విజేతులుగా నిలిచిన విద్యార్థులకు కళాప్రదర్శనలు ఇచ్చిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి సునంద, డీఈవో విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నుషిత, డీఎంహెచ్‌వో సంధ్యాకిరణ్మయి, పరశురాం, సహదేవుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నారాయణపేటరూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట మండల పరిధిలోని రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారు జామున 6గంటల ప్రాంతంలో కోటకొండ శివారులో అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. కావలి నరేష్ అలియాస్ ఆంజనేయులు కోయిల్‌కొండ మండలానికి చెందిన వ్యక్తి కోయిల్‌కొండ నుంచి కోటకొండకు ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు ఆపి విచారణ చేసి వాహనం స్టేషన్‌కు తరలించి కావలినరేష్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ రాముడు తెలిపారు.

రాష్ట్రపతిని కలిసిన విద్యార్థులు

గండీడ్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని గండీడ్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే 20 మంది విద్యార్థులు, ఐదుగురు ఉపాధ్యాయుల బృం దం ఈనెల 17న రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసారు. అలాగే రాజధానిలో గల చారిత్రాత్మక ప్రదేశాలను, అధికారిక భవనాలను విద్యార్థులతో సందర్శించి చారిత్రక కట్టడాల విశేషాల గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు తెలియజేశారు.



రాష్ట్రపతిని కలిసిన గండీడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

» మరో విద్యార్థికి తీవ్ర గాయాలు

» కురుమూర్తి జాతరకు వస్తుండగా ఘటన

చిన్నచింతకుంట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కురుమూర్తిస్వామి దర్శనానికి వస్తుండగారోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి దుర్మరణం చెందగా, మరో విద్యార్థికి తీవ్ర గాయాలైన ఘటన మహ బూబ్‌నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలంలోని గూడూరు సమీపంలో చోటుచేసుకుంది. ఎస్ఐ కృష్ణ ఓబుల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్ నగర్ వైపు నుంచి కురుమూర్తి జాతరకు బైక్‌పై వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం గట్లఖానాపూర్‌కు చెందిన బోయ నితీష్, నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం గోటూరుకు చెందిన జోగు నందు ఇరువురు విద్యార్థు లు కలిసి వస్తున్నారు. ముందున్న ఆటోను తప్పించబోయి కురుమూర్తి జాతర నుంచి వస్తున్న కారు, బైక్ ఢీకొన్నా యి. బైక్‌పై వెనుకాల కూర్చు న్న జోగు నందు (23) ఎగిరి వెనకాల వస్తు న్న ట్రాక్టర్ ట్రాలీ డోర్‌కు తల తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న నితీష్ కు తీవ్ర రక్త గాయాలు కాగా మండల కేంద్రం లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో మహబూబ్‌నగ ర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన యువకుడి మృతదేహాన్ని వనపర్తి జిల్లా ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ రోడ్డు ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఫిర్యాదు వచ్చిన వెంటనే కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు



ధ్వంసమైన ఆర్టీసీ బస్సు ముందు భాగం

జడ్చర్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ముందుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీ కొట్టిన సంఘటన 44వ నెంబరు జాతీయ రహదారి బాలానగర్ మండల కేంద్రంలో గురువా రం తెల్లవారుజామున చోటు చేసుకుంది. కర్నూల్ నుంచి తొమ్మిది మంది ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు తెల్లవారుజామున 4గంటల ప్రాంతంలో ముందుగా వెళ్తున్న లారీని ఢీ కొట్టింది. బాలానగర్ మండల కేంద్రంలో ప్రస్తుతం జాతీయ రహ దారిపై ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతున్నాయి. అందుకనుగుణంగా ముందుగా లారీ వేగం తగ్గించి వెళ్తుండగా వేగాన్ని తగ్గించి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. అతివేగంగా వాహనాలు నడిపిఉంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని, ఈ సంఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని బాలానగర్ ఎస్ఐ లెనిన్ తెలిపారు. లారీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడ్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎలక్ట్రికల్ దుకాణంలో దొంగతనం

కొత్తకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : దుకాణం షె ట్టర్‌ను పైకెత్తి రూ.లక్ష నగ దును చోరీ చేసిన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండల కేంద్రంలో గురువా రం చోటుచేసుకున్నది. పట్ట ణంలోని భవాని శంకర దేవా లయ ఎదురుగా రామనంతపూర్ గ్రామానికి చెందిన రంజిత్ కుమార్‌రెడ్డి సాయి ఎలక్ట్రికల్స్ దుకాణం నడుపుతున్నారు. ఎప్పటిలాగే దుకాణం షెట్టర్లకు తాళాలు వేసి ఇంటికెళ్లాడు. ఉదయం రోడ్డు వెంట వాకర్స్, సమీప ప్రజలు తెరిచిఉన్న షెట్టర్‌ను గమనించి దుకాణం యజమానికి సమాచారం ఇచ్చారు. పోలీసులకు తెలపడంతో సీసీ కెమెరాలను పరిశీలించారు. ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు తెల్లవారు జామున 4 గంటల సమయంలో షెట్టర్‌ను పైకెత్తి ఒకడు లోపలికి దూరాడు.. కౌంటర్‌లోని డ్రాను పగులగొట్టగా, అందులో ఉన్న నగదును ఎత్తుకెళ్లిన దృశ్యం కనిపించింది. సీఐ రాంబాబు దుకాణా న్ని పరిశీలించి క్లూస్ టీంను రప్పించి ఆనవాళ్లు సేకరించారు. దుకాణం య జమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

ఊట్కూర్‌లో చిన్నారులపై కుక్కల దాడి



చేతికి కాట్లతో ఎండీ అర్షద్

ఊట్కూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందుర ఇద్దరు చిన్నారులు ఆడు కుంటుండగా వీధికుక్కలు దాడి చేసి గా యపరిచాయి. ఈ సంఘటన గురువారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితుల క థనం ప్రకారం.. మండల కేంద్రంలోని భర త్‌నగర్‌కు చెందిన ఎండీ అర్షద్ ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధికుక్కలు ఒ క్కసారిగా చిన్నారిపై దాడి చేశాయి. బాలు డు భయపడి అరవగా ఇంట్లో ఉన్నవారు వచ్చి కుక్కలను తరిమివేశారు. అలాగే పాతపేట వీధికి చెందిన స్వాతి అనే చిన్నారి సైతం ఇంటి ముందు ఆడుకుంటుండగా దాడి చేసి కరిచాయి. దీంతో ఇద్దరు చిన్నారులకు రక్తగాయం కావడంతో బాధిత కుటుంబ సభ్యులు చిన్నారులకు ఊట్కూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన నల్లారెడ్డి

అయిజ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లా అయిజ మండల ప రిధిలోని సంకాపూర్ గ్రామ సమీపంలో జరి గిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు తీవ్రంగా గాయ పడ్డారు. కర్ణాటకలోని మ ల్యాపూర్ గ్రామానికి చెందిన నల్లారెడ్డి అయిజ కు వచ్చిన పని పూర్తి చేసుకుని తన మిత్రునితో కలిసి ద్విచక్రవాహనంపై గురువారం తన గ్రామవైపు రాయచూర్ రోడ్డుపై బయలుదేరాడు. మల్దకల్ మండలం శేషంపల్లికి చెందిన నాగన్న అయిజ నుంచి రాయచూర్ వైపు తన ద్విచక్రవాహనంపై బయలుదేరారు. సంకా పూర్ గ్రామ సమీపంలో ఓవర్‌టేక్ చేయబోయి నాగన్న నల్లారెడ్డి వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ఇద్దరి తలలకు తీవ్ర గాయాలు అయ్యాయి. అంబులెన్స్‌లో అయిజలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువచ్చారు. మెరుగైన వైద్యం కోసం నాగన్నను కర్నూల్ ఆస్పత్రికి, నల్లారెడ్డిని రాయచూర్ ఆస్పత్రికి తరలించారు.

బైక్ కింద పడి యువకుడికి..

కొత్తపల్లి,(ఆంధ్రజ్యోతి): రోడ్లపై ధాన్యం కనిపంచక బైక్‌పై వెళ్తున్న యువకుడికి గాయలైన సంఘటన కొత్తపల్లి మండలంలోని నిడ్జింత గ్రా మ శివారులో చోటు చేసుకుంది. కొత్తపల్లి మండలం లింగాల్‌చెడ్ గ్రామా నికి చెందిన కృష్ణ మద్దూరు నుంచి సొంత గ్రామానికి తిరిగి వస్తుండగా రోడ్లపై ఉన్న వరి కుప్పలపై నల్లని టార్పాలిన్లు కప్పడంతో కుప్పలు కని పించక ఒక్కసారిగా బైక్ కుప్పపైకి ఎక్కడంతో కిందపడిన యువకుడికి హెల్మెట్ ఉండటంతో స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

రెండు బైకులు ఢీ...

గండీడ్,(ఆంధ్రజ్యోతి): రెండు బైకులు ఢీకొని ఓ వ్యక్తికి కాలు విరిగిన ఘటన గండీడ్ మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపి న వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన వెంకటయ్య(65) పనినిమిత్తం గండీడ్‌కు వస్తుండగా ఎదురుగా వచ్చిన మరోబైక్‌ను ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. కుడికాలు విరిగింది. స్థానికులు 108కు సమాచారమివ్వగా అక్కడకు చేరుకున్న ఈఎంటీ జానమ్మ, పైలెట్ చాంద్‌పాష ప్రథమ చికిత్సచేసి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రైసుమిల్లు యజమానిపై కేసు నమోదు

పెద్దమందడి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పెద్దమందడి మండల పరిధిలోని మోజర్ల గ్రామ సమీపంలో ఉన్న రెండు రైసు మిల్లుల యజ మాని శివప్రసాద్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివకు మార్ తెలిపారు. మోజర్ల సమీపంలో ఉన్న చాముండి, వారాహి రైస్ మి ల్లులలో ధాన్యం నిలువలు లేనట్లు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు అందడంతో ఈనెల 12న దాడులు చేశారు. సివిల్స్ సప్లై కార్పొరేషన్ మేనే జర్ జగన్మోహన్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు చేసినట్లు తెలిపారు.

వృద్ధిలో మత్స్య సంపద

» మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో జిల్లాలో చేపపిల్లల ఉత్పత్తి కేంద్రానికి సన్నాహాలు

» మక్తల్ సంగంబండ రిజర్వాయర్ సమీపంలో ఏర్పాటుకు మంత్రి స్థల పరిశీలన

» నేడు ప్రపంచ మత్స్య దినోత్సవం



సంగంబండ రిజర్వాయర్‌లో చేప పిల్లలను విడుదల చేస్తున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి (ఫైల్)

నారాయణపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మ త్స్య సంపద పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. సాగునీటి వనరులలో చేపపిల్లలను వదిలి చేపల పెంపకానికి చర్యలు తీసుకుంటుండడం తో మత్స్యకారులకు ఉపాధి లభిస్తున్నది. నారాయణ పేట జిల్లా వ్యాప్తంగా 147 మత్స్యకారుల సహకార సంఘాలు ఉన్నాయి. అందులో 11,500 మంది స భ్యులుగా ఉన్నారు. 147 మత్స్యసహకార సంఘాల్లో 136 మత్స్యకార పురుష సంఘాలు ఉండగా, 11 మ హిళా సంఘాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 641 చె రువులు ఉన్నాయి. భూత్పూర్, సంగంబండ రిజర్వా యర్‌లు ఉన్నాయి.

జిల్లాలో కోటీ 82 లక్షల చేపల పెంపకం

జిల్లా వ్యాప్తంగా యేటా వానాకాలంలో కోటీ 82 లక్షల చేపల పెంపకం లక్ష్యంగా ఉంది. ఇందులో 35 నుంచి 40మిల్లీమీటర్ల చేపపిల్లలు కోటీ రెండు లక్షలు, 80 నుంచి 100 మిల్లీమీటర్ల చేపపిల్లలు 80.31 లక్షలు వదలాల్సి ఉంటుంది. అయితే చేపపిల్లలను ఏటేటా ఆంధ్రప్రదేశ్ నుంచి టెండర్లు పొందిన కాంట్రాక్టర్లు జి ల్లాలోని చెరువులలో విడిచేందుకు చర్యలు తీసుకునే వారు. అయితే, ఈ సారి వనపర్తి జిల్లా నుంచి చే పపిల్లల దిగు మతి అయ్యా యి. పెద్ద చేప పిల్లలు సరఫరా చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకు రావడంతో జిల్లాలో 80.31 లక్షల చేపపిల్లలు వదిలే లా జిల్లా మత్స్యశాఖ చర్యలు తీసుకుంటున్నది. చి న్న చేపపిల్లల సరఫరా కోసం టెండర్లలో పాల్గొనేందు కు ఎవరూ ముందుకు రాలేదు. పెద్ద చేపపిల్లలు ఇప్పటి వరకు జిల్లాలో 61 పెద్ద చెరువులలో 73.92 లక్షలు వదిలారు. మిగ తావి సోమవారం మ ద్దూర్ మండలం రెనివట్ల చెరువుతో పాటు జూరాల బ్యాక్‌వాటర్ ముష్టిపల్లి దగ్గర చేప పిల్లలు వదిలే లా చర్యలు తీసుకుం టున్నారు. 80.31 లక్షల చేపపిల్లల వదిలే ప్రక్రి య పూర్తయిందని జి ల్లా ఫిషరీస్ అధికారి రహమాన్ తెలిపారు. మక్తల్ మండలంలోని సంగం బండ రిజర్వాయర్‌లో అక్టోబరు 17న జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి వాకిటి శ్రీహరి చేపపిల్లల పంపిణీ ప్రక్రియను ప్రారంభిం చారు.

జిల్లాలో మత్స్యకార్మికులకు మంచి రోజులు

మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో జిల్లాలోని మక్తల్ మండలం సంగంబండ రిజర్వాయర్ సమీపంలో చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలోని మత్స్యకార్మికులకు చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుతో మేలు చేకూరనుంది. తాజాగా మంత్రి, ఫిషరీస్ డైరెక్టర్ నిఖిల్‌తో పాటు మత్స్యకార్మికశాఖ అధికార యంత్రాంగం సంగంబండ రిజర్వాయర్ సమీపంలో చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు కావాల్సిన వసతులతో పాటు స్థల పరిశీలన చేశారు. 20 ఎకరాల ప్రభుత్వ భూమిలో చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు సంబంధించి పూర్తిస్థాయి నివేదికలు సిద్ధం చేసేలా రాష్ట్ర ఫిషరీస్ డైరెక్టర్ నిఖిల్ దృష్టి సారించారు. సంగంబండ కెనాల్ వాటర్ సర్‌ప్లేస్‌గా ఉండడంతో పాటు సిమెంట్ స్ట్రక్చర్స్ హ్యాచరీస్, గ్రేడర్ పౌండ్స్ తదితర వాటిని హైటెక్ సర్వ హంగులతో సమకూర్చి చేపపిల్లల ఉత్పత్తి కేంద్రంలో సకల ఏర్పాట్లు చేయనున్నారు.

చేపల పెంపకంతో

ఆర్థిక అభివృద్ధికి అడుగులు

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల మొదటి వారం నుంచి మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు చేప పిల్లలు పంపిణీ చేస్తున్నారు. మత్స్యకారులకు చేప పిల్లల పంపిణీ, వ్యాపారానికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుండడంతో వారి ఆర్థిక అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి.

● 235 మత్స్య పారిశ్రామిక సహకార సొసైటీలు

నాగర్‌కర్నూల్ జిల్లాలోని 1150 చెరువులతో మత్స్య పరిశ్రమ అభివృద్ధి కోసం బలమైన సంస్థాగత వ్యవస్థ ఉంది. జిల్లా వ్యాప్తంగా 235 మత్స్య పారిశ్రామిక సొసైటీలు ఉండగా అందులో మొత్తం 19,500 మంది మ త్స్యకారులు సభ్యులుగా ఉన్నారు. జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో వీరికి వృత్తిపరమైన తోడ్పాటు అందిస్తున్నారు.



చేప పిల్లలు

● 258 లక్షల చేప పిల్లల నిల్వ లక్ష్యం

ఈ ఏడాది జిల్లాలో వర్షాలు సమృద్ధిగా కురిశాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా అన్ని చెరువులు వందశాతం జలకళలాడుతున్నాయి. దీంతో ఈ సారి జిల్లా వ్యాప్తంగా మత్స్యకార సొసైటీల పరిధిలోని 1150 చెరువుల్లో 258 లక్షల చేప పిల్లలు వదిలి పెంపకానికి లక్ష్యంగా పెట్టుకుని అధికారులు ప్రణాళికలు తయారు చేశారు. ఇప్పటికీ జిల్లా వ్యాప్తంగా 35 మిల్లీ మీటర్ల నుంచి 40 మిల్లీ మీటర్ల మధ్య సైజు కలిగిన 158 లక్షల చేప పిల్లలను వదిలారు. అదేవిధంగా 25 మిల్లీ మీటర్ల సైజు చేప పిల్లలను 100 లక్షలు చెరువుల్లో వదిలారు. మిగతా చేప పిల్లల పంపిణీ వేగవంతంగా పూర్తి చేస్తామని జిల్లా మత్స్యశాఖ ఏడీ నర్సింహరావు తెలిపారు.

ఉపాధ్యాయుడికి మెమో జారీ

» 'వరుస సెలవులు... సమయానికి రారు' కథనానికి స్పందించిన అధికారులు



బాల్యలోక్యతండా పాఠశాల ఉపాధ్యాయుడికి మెమో అందజేస్తున్న కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ రహీం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఊర్కొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'వరుస సెలవులు.. సమయానికి రారు' 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఊర్కొం డ మండలంలోని బాల్యలోక్య తండా ప్రా థమిక పాఠశాల ఉపాధ్యాయుడు వరుస సె లవులు పెట్టడంతో పాటు సమయపాలన పాటించడం లేదని... పాఠశాలకు వచ్చిన గంట, రెండు గంటల పాటు ఉండి వెళుతు న్నాడని వార్త ప్రచురితమైంది. దీంతో మం డల ఇన్‌చార్జి విద్యాధికారి శంకర్‌నాయక్ స్పందించి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు అ బ్దుల్ రహీంను విచారణ చేసి చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. దీంతో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మండలంలోని బాల్యలోక్య తండాను గురువారం పరిశీలిం చారు. పాఠశాల వి ద్యార్థులను, వారి త ల్లిదండ్రులను కలిసి ఉపాధ్యాయుడి విధి నిర్వహణలో విద్యా బోధన, సమయపా లనపై విచారణ చేపట్టారు. విచారణలో వె ల్లడించిన అంశాలను మండల ఇన్‌చార్జి వి ద్యాధికారి శంకర్‌నాయక్‌కు తెలియజేశారు. వారి ఆదేశాల మేరకు మెమో జారీ చేయ డంతో పాటు ఒక రోజు వేతనం కట్ చేసిన ట్లు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ రహీం తెలిపారు. తదుపరి విషయాలను జి ల్లా ఉన్నతాధికారులకు తెలియజేసి చర్యలు తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యార్థిని అభినందించిన డీఐఈవో



జాతీయస్థాయి కరాటే టోర్నీలో ప్రతిభ చాటిన విద్యార్థిని అభినందిస్తున్న డీఐఈవో

మహబూబ్ నగర్ స్పోర్ట్స్, నవంబరు 20 (ఆంధ్ర జ్యోతి): హైదరాబాద్‌లో ఈ నెల 16న జరి గిన ప్రెసిడెంట్ కప్ ఆలిండియా ఓపెన్ కరాటే చాం పియన్‌షిప్‌లో కటాస్‌లో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించిన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థిని హఫ్సాబేగంను డీఐఈవో కౌసర్ జహాన్ అభి నందించారు. గురువారం కళాశాల ఆవరణలో విద్యార్థిని సత్కరించారు. జాతీ య స్థాయి పోటీల్లో పతకాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. కింగ్‌షో టోకాన్ కరాటే డూ ఇండియా ఫౌండర్ జహంగీర్ పాషఖాద్రీ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

23న జిల్లా కబడ్డీ జట్ల ఎంపికలు

రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో పాల్గొనే మహబూబ్‌నగర్ జిల్లా మహిళ, పురుషుల జట్ల ఎంపికలను ఈ నెల 23న ఇండోర్‌స్టేడియంలో నిర్వహిస్తున్న ట్లు జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శాంతికుమార్, కురుమూర్తిగౌ డ్ ఒక ప్రకటనలో తెలిపారు. పురుషుల 85 కిలోల బరువు కలిగి, మహిళలు 65 కిలోల బరువు కలిగి ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. డిసెంబర్ 11 నుంచి 14వ తేదీ వరకు కరీంనగర్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి టోర్నీలో జిల్లా జట్లు పాల్గొంటుందని తెలిపారు.

ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ

గద్వాల అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ ఛాంపియషిప్-2025లో స్థానిక మదర్సా పాఠశాలకు చెందిన వి ద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించారని పాఠశాల కర స్పాండెంట్ షాకీర్ గురువారం విలేకరులకు తెలిపారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 17, 18, 19న నిర్వహించిన ఉషా (కరాటే) పోటీల్లో సబ్ జూనియర్ కేటగిరి-2లో మదర్సా పాఠశాల విద్యార్థులు సిద్రతుల్ ముంతహ రెండు సిల్వర్ మెడల్స్, అబ్రాజ్ ఒక గోల్డ్ మెడల్, ఒక సిల్వర్, ఉమర్ రెండు గోల్డ్ మెడల్స్‌ను కైవసం చేసుకున్నట్లు చెప్పారు. అదే విధంగా సబ్ జూనియర్స్ అండర్-12 సండ(ఫైట్) విభాగంలో అలీఖాన్, సబ్ జూనియర్స్ అండర్-14లో మహమ్మద్ సాద్(బ్రాంజ్), హస నుద్దీన్, ఎండీ ఉమర్(సిల్వర్), ఎండీసాద్ గోల్డ్ పతకాలు సాధించారన్నారు.

15 క్వింటాళ్ల పత్తి దగ్ధం

» రూ. 3.5 లక్షల ఆస్తినష్టం



మంటలను ఆర్పుతున్న రైతులు

ఊట్కూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నిల్వ ఉంచిన చోట ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని 15 క్వింటళ్ల పత్తి దగ్ధమైన సం ఘటన గురువారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలో చోటు చేసు కుంది. గ్రామస్థుల కథనం ప్రకారం... ఊ ట్కూర్ మండల కేంద్రంలోని కుర్వ వీధికి చెందిన లడ్డచంద్రపొల్ల మల్లెష్ అనే కౌలు రైతు తన సొంత పొలం 4 ఎకరాలతో పా టు గ్రామ సమీపంలో 10 ఎకరాల భూమి ని కౌలుకు తీసుకుని పత్తి పంటను సాగు చేశారు. అనంతరం 14 ఎకరాల్లో తీసి సు మారు 50 క్వింటళ్ల పత్తిని పొలం నుంచి తీసిన తర్వాత గ్రామ సమీపంలోని కౌలు పొలంలో అమ్మడానికి వాటిని నిల్వచేశారు. గురువారం పొలానికి వచ్చి న రైతు మల్లప్ప పత్తి అ మ్మడానికి పోవాల్సి ఉండ టంతో కూలీల కోసం గ్రా మంలోకి వెళ్లాడు. కొంత స మయం తర్వాత పత్తి ఉన్న ప్రదేశం నుంచి పొగలు రా వడంతో పక్కపొలాల్లో కూలీలు గమనించి చూడగా అప్పటికే లోన నిప్పు అంటుకోవ డంతో వెంటనే ఆర్పే ప్రయత్నం చేశారు. రైతుతో పాటు గ్రామస్థులకు తెలియజేశారు. వారు ఫైర్ ఇంజన్ అధికారులకు సమాచా రం ఇచ్చారు. ఫైర్‌ఇంజన్ వచ్చి మంటలను ఆర్పడంతో అప్పటికే దాదాపు 15 క్వింటళ్ళ పత్తి దగ్ధమయ్యింది. వెంటనే కూలీలు కాలి పోయిన దాంట్లో నుంచి మిగిలిన పత్తిని వే రు చేసి మందు స్ప్రేయర్ మందు డబ్బాతో పూర్తి స్థాయిలో మంటలను ఆర్పారు. కాలి పోయిన పత్తిని చూసి రైతు కుటుంబ స భ్యులు బోరున విలపించారు. అనంతరం అ గ్నిమాపక శాఖ ఎస్ఐ రమేష్‌రెడ్డి, రెవెన్యూ ఆర్ఐ కృష్ణారెడ్డిలు పంచనామా నిర్వహించా రు. విషయం తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ సూర్యప్రకాష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గోవింద ప్ప, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోరం మహేశ్వర్‌రెడ్డిలు సంఘటన స్థలానికి చేరుకుని రైతును పరామర్శించారు.

దేశ భవిష్యత్‌కు ఉపాధ్యాయుల పాత్ర కీలకం

» పీయూ రిజిస్ట్రార్ పూస రమేష్‌బాబు



మాట్లాడుతున్న పీయూ రిజిస్ట్రార్ పూస రమేష్‌బాబు

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్‌కు ఉపా ధ్యాయుల పాత్ర కీలకమని పీయూ రిజి స్ట్రార్ పూస రమేష్‌బాబు అన్నారు. గురు వారం పీయూలోని అకాడమిక్ బ్లాక్‌లోని వి ద్యా కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన సెంటర్ ఫర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఉర్దూ మీడియం టీచర్స్, తెలంగాణ రాష్ట్ర ఎస్‌సీఈఆర్‌టీ సంయుక్తంగా ఆధ్వర్యం లో ఉర్దూ మాధ్యమ ఉపాధ్యాయుల వృత్తిప రమైన నైపుణ్యాల అభివృద్ధి అనే అంశంపై ఒక రోజు వ ర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ఉపాధ్యాయుల సామర్థ్యాభివృద్ధిలో ఎన్‌ఈపీ 2020, ఎన్‌సీఎఫ్ ప్రాముఖ్య తను వివరించారు. అనంతరం అబ్దుల్ సిద్ది ఖీ మాట్లాడుతూ బోధనలో మాతృభాష ప్రాముఖ్యత, నూతన విద్యావి ధానాల అమలు వివరించా రు. ఈ సందర్భం గా డాక్టర్ బషీర్ అహ్మద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కరుణాకర్ రెడ్డి, విభా గధిపతి డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ జం గం విశ్వనాథ్, డాక్టర్ జయ నాయక్, డాక్టర్ విజయలక్ష్మీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

పెద్దమందడి, నవంబరు 20 (ఆంధ్ర జ్యోతి): ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీలకు పెద్దమందడి పాఠశాల నుంచి ఇద్దరు విద్యా ర్థులు ఎంపిక అయినట్లు పీడీ మన్నెం తెలి పారు. శుక్రవారం జడ్చర్ల మినీ స్టేడియంలో జరిగే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థా యి క్రికెట్ టోర్నమెంట్‌కు జిల్లా పరిషత్ ఉ న్నత పాఠశాల పెద్దమందడిలో పదవ తర గతి చదువుతున్న ప్రకాష్ ఎంపికైనట్లు పాఠ శాల ప్రధానోపాధ్యాయులు శాంతన్న, ఫిజిక ల్ డైరెక్టర్ మన్యంయాదవ్ తెలిపారు. ఈ నె ల 12న వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వ హించిన జిల్లా స్థాయి క్రికెట్ సెలక్షన్‌లో పా ల్గొని ప్రతిభ కనబరిచి అండర్-17 విభాగం లో ప్రకాష్, అండర్ -14 విభాగంలో జయ సింహ ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఏఏపీసీ చైర్మన్ గ్రామ పెద్దలు, ఉపాధ్యాయ బందం, విద్యార్థిని విద్యార్థులు అభినందించారు.

నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలి

» 8వ బెటాలియన్ కమాండెంట్ ఆఫీసర్ కల్నల్ ఎస్.కె.సింగ్

మహబూబ్‌నగర్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ క్యాడెట్లు దేశభక్తిని, సమాజసేవను, నాయకత్వ లక్షణాలను అల వర్చుకొని ఉత్తమ భారతావని నిర్మాణంలో కొనసాగాలని కమాండెంట్ కల్నల్ ఎస్.కె. సింగ్ కోరారు. గురువారం స్థానిక జేపీఎన్‌సీ కళాశాలలో ఎన్‌సీసీ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ ముగింపు సమావేశానికి ఎస్.కె.సింగ్ పాల్గొని ప్రసంగించారు. దేశ రక్షణ విషయం లో ప్రాణాలను తృణప్రాయంగా భవిస్తున్న సైన్యంలో చేరాలని అన్నారు. ఏటీసీ-10 క్యాడెట్స్‌కు ఎన్‌సీసీ హిస్టరీ, వెపన్ ట్రైనింగ్, డ్రిల్, మ్యాప్ రీడింగ్, లీడర్‌షిప్ క్వాలిటీస్, హెల్త్ మరియు హైజీ న్, ఫైరింగ్ ప్రాక్టీస్ వంటి మిలిటరీ విభా గాలలో విజయవం తంగా శిక్షణ ముగిం చుకున్నందుకు అభి నందించారు.హైదరాబాద్ గ్రూ ప్ కమాండర్ కల్నల్ ప్రశాంత్‌కుమార్ మా ట్లాడుతూ క్యాంప్‌లో డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఫీల్డ్ క్రాఫ్ట్ బ్యాటిల్ క్రాఫ్ట్ ఫైర్ ఫైటింగ్‌లో, బంకర్ బ్లాస్ట్ డ్రిల్‌లో పాల్గొన్న క్యాడెట్లను అ భినందించారు. అనంతరం ఎస్‌డీ, ఎస్ డబ్ల్యులు నిర్వహించిన గౌరవ వందనాన్ని గ్రూప్ కమాండర్ స్వీకరించారు. మహబూబ్ నగర్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరంలో ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎస్‌డీ, ఎస్‌డబ్ల్యు, ఏఎన్‌వోలు, పీఐ సిబ్బంది పాల్గొ న్నారు. ఏటీసీ- 10లో 652 ఎన్‌సీసీ క్యాడెట్లు జేడీ, జేడబ్ల్యు ఎస్‌డీ, ఎస్‌డబ్ల్యు, వివిధ పాఠ శాలలు, కళాశాలల నుంచి పాల్గొన్నారు. సు బేదార్ మేజర్, జేసీవోలు ఎన్‌సీవోలు, ఏఎన్ వోలు,ఎన్‌సీసీ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

పోక్సో కేసులో వ్యక్తికి రిమాండ్

గద్వాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గద్వాల మండలంలోని ఓ బాలిక కు మాయమాటలు చెప్పి పెళ్లి పేరుతో మోసం చేసిన వ్యక్తిని గు రువారం రూరల్ పోలీసులు రిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం గోటూరు గ్రామానికి చెందిన మహేశ్ బాలికకు మాయమాటలు చెప్పి పెళ్లి పేరుతో మోసం చేశాడని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా, న్యాయాధికారి రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

విద్యార్థుల అభ్యసనంపై దృష్టి సారించాలి

ధరూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బోధనతో పాటు విద్యార్థుల అభ్యసనంపై ప్రత్యేక దృష్టి సారించాలని కాంప్లెక్స్ హెచ్ఎం ప్రతాప్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం, ప్రాథమిక పాఠశాల, కురువవీధి పాఠశాలలను పరిశీలించారు. గైర్హాజరైన విద్యార్థుల వివరాలను తీసుకుని వారి తల్లిదండ్రులకు తెలిపి తిరిగి బడులకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఎఫ్ఆర్ఎస్, అపార్ వందశాతం పూర్తి చేయాలని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

గద్వాల సర్కిల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అపరిష్కృత సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు తిమ్మప్ప, ప్రధాన కార్యదర్శి యోగేందర్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల 5 డీఏలను వచ్చే నెల 9న జరిగే ప్రజాపాలన దినోత్సవాలలో ప్రకటించాలని కోరారు. పీఆర్సీ నివేదికలను తెప్పించుకుని అందరికీ ఆమోదయోగ్యమైన ప్రకటన చేయాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలని కోరారు.

ఎల్‌వోసీ అందజేత

గద్వాల న్యూటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ధరూర్ మండలంలోని వామనపల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్‌కు మెరుగైన వైద్యచికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 2.50 లక్షల ఎల్‌వోసీ లెటర్‌ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గోవిందు తదితరులు ఉన్నారు.

డ్రగ్స్‌లేని సమాజాన్ని నిర్మించాలి: ఎస్ఐ



మాట్లాడుతున్న ఎస్ఐ నందీకర్

మల్దకల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ లేని సమాజ స్థాపనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఐ నందీకర్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన నషాముక్త భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యువత మంచి లక్ష్యంతో చదువుకొని భవిష్యత్తు నిర్మించుకోవాలని, మత్తు పదార్థాల వైపు ఆలోచించరాదని సూచించారు. ప్రిన్సిపాల్ నర్సింహ, ఫణిమోహన్‌రావు, మనోజ్‌రెడ్డి, వెంకటేశ్, రామాంజనేయులు, శివప్రసాద్, తిరుమలేశ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి

గద్వాల టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న గ్రంథాలయ భవన పనులు వెంటనే పూర్తిచేసి పాఠకులకు అందుబాటులోనికి తేవాలని బీఆర్ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ కురువ పల్లయ్య కోరారు. గ్రంథాలయాల అభివృద్ధిపై పాలకులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని జిల్లా గ్రంథాలయంలో బీఆర్ఎస్వీ నాయకులు పుస్తక ప్రదర్శనలో పాల్గొన్నారు. పుస్తక పఠనతో వ్యక్తిత్వ వికాసానికి మార్గం ఏర్పడుతుందని, దీంతో పాటు ప్రజా చైతన్యానికి గ్రంథాలయాలు వేదికలుగా ఉన్నాయన్నారు. జిల్లాలోని అన్ని గ్రంథాలయాలను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో మహదేవ్, మార్క్, మహేష్, రంగస్వామి, నటరాజ్, పాఠకులు ఉన్నారు.

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

వడ్డేపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థిని మోకాళ్లపై నడిపించి గాయాలకు గురిచేసిన ప్రైవేటు పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ కురవ పల్లయ్య అన్నారు. గురువారం శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పల్లయ్య మాట్లాడారు. కొంకల గ్రామానికి చెందిన ఓ విద్యార్థి పాఠాలు సరిగ్గా చదవడం లేదని మోకాళ్ల చిప్పలకు గాయాలు అయ్యే విధంగా నడిపించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ ఘటనపై కలెక్టర్ విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని, లేకపోతే పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామన్నారు.

ముగిసిన సప్తాహ భజన

ఇటిక్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నిర్వహించిన భాగవతా సప్తాహ కార్యక్రమం గురువారంతో ముగిసింది. భజన అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకట్రాముడు, దినేష్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, సత్యప్రియ, కృష్ణయ్య, ప్రసాద్, సతీష్, మౌలాలి, వెంకటేష్ పాల్గొన్నారు.

జఠిలమైన డ్రైనేజీ సమస్య

- ప్రధాన రహదారికి పొంచివున్న ప్రమాదం
- అధికారుల నిర్లక్ష్యమే అంటున్న స్థానికులు



కల్వర్టు వద్ద డ్రైనేజీకి అడ్డంగా నిర్మించిన గోడ

గద్వాల టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ధరూరు మెట్టు సమీపంలో పురాతన డ్రైనేజీ ప్రమాదకరంగా మారింది. దాదాపు 70ఏళ్ల క్రితం గద్వాల - రాయచూరు రోడ్డు నిర్మాణం జరిగిన సమయంలో పై ప్రాంతం వైపు నుంచి వచ్చే వర్షపు నీరు సాఫీగా దిగువకు వెళ్లేందుకు రోడ్డుపై నిర్మించిన కల్వర్టును ఉద్దేశపూర్వకంగా మూసి వేయడంతో ప్రమాదం ఏర్పడింది. పాత వాటరుట్యాంక్ పై భాగం కాలనీ, రాఘవేంద్ర కాలనీ ఏర్పాటు కాకముందు వర్షపు నీరు మాత్రమే వచ్చి కల్వర్టు గుండా దిగువకు వెళ్లే ఏర్పాటు ఉండేది. కాలనీల ఏర్పాటు అనంతరం మురుగు ఈ మార్గంలో వస్తుండడంతో రోడ్డుకు ఉత్తరం వైపున ఉన్న పొలం యజమానులు క్రమంగా అభ్యంతరాలు వ్యక్తం చేయడం ప్రారంభించారు. వాస్తవానికి ప్రస్తుతం ఉన్న ప్రైవేటు వ్యక్తుల పొలం దిగువ భాగం నుంచి జాలు నీరు వెళ్లేందుకు సహజసిద్ధంగా ఉన్నమార్గాన్ని సైతం చదును చేసి సాగు చేయడంతో సమస్య మొదలైంది. నాలుగేళ్ల క్రితం సమస్యను మునిసిపల్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా, సర్వే కోసం ఆదేశించిన కలెక్టర్ తాత్కాలిక ఏర్పాటుగా రోడ్డు సమీపంలో కచ్చా డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. అది ఏడాది లోగానే దెబ్బతినగా తిరిగి సమస్య మొదటికి వచ్చింది. కల్వర్టు గుండా నీరు సాఫీగా వెళ్లే అవకాశం లేకపోవడంతో రోడ్డుకు ఒకవైపునే మురుగు వచ్చి చేరుతుంది. వర్షాకాలంలో మురుగు, వర్షపునీరు రోడ్డుపైకి వచ్చి చేరడం పరిపాటిగా మారింది. ఇటీవల కురసిన జోరు వర్షాల సమయంలో కొద్దిసేపు రోడ్డుపై వాహన సంచారం నిలిచిపోగా స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

మూసుకుపోయిన మార్గం

ప్రధాన రోడ్డు కల్వర్టు గుండా దిగువకు నీరు వెళ్లి.. వేదనగర్ ఎస్సీ బాలికల హాస్టల్ వెనుక భాగంలో పాత కాల్వ గుండా వెళ్లి గంటవీధి పురాతన కాల్వలో చేరేది. అక్కడి నుంచి కృష్ణారెడ్డిబంగ్లా సమీపంలో గల కందకంలోకి వెళ్లే అవకాశం ఉండగా.. ఈ మార్గమంతా ఆక్రమణకు గురికావడమే సమస్యగా మారింది. రెవెన్యూ అధికారుల సహకారంతో క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహిస్తే తప్పా ఈ సమస్యకు పరిష్కారం దొరకదని స్థానికులు బాహాటంగా చెబుతున్నారు. గతంలో ఈ దిశగా కొంత ప్రయత్నం జరిగినా అనివార్య కారణాలతో ఎప్పటికప్పుడు సర్వే వాయిదా పడుతూ రావడంతో మునిసిపల్ అధికారులు సైతం చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేస్తున్నారు. ఇప్పటికైనా మునిసిపల్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా కార్యాచరణ చేపట్టి డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం



మురుగు ప్రధాన రోడ్డు కల్వర్టు వద్ద నిలిచి పోతుండటం సమస్యగా మారింది. ప్రధాన రోడ్డుకు అటువైపు ఉన్న స్థలం ప్రైవేటు వ్యక్తులది కావడంతో రెవెన్యూ రికార్డుల ఆధారంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. విషయాన్ని కలెక్టర్, అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

- జానకీరామ్ సాగర్, మునిసిపల్ కమిషనర్, గద్వాల

గద్వాలను టాప్‌టెన్‌లో నిలపాలి

- ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యాన్ని వేగంగా పూర్తిచేయాలి
- కలెక్టర్ బీఎం సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మండలాల వారీగా పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. వందశాతం ఇంటి నిర్మాణ పనుల లక్ష్యాలను చేరుకోవాలని, ప్రత్యేక చొరవ తీసుకొని వివిధ దశలలో ఉన్న వాటిని పూర్తి చేయాలన్నారు. అవసరమైన ఇసుక అందుబాటులో వచ్చినందున పనులను వేగవంతం చేసి జిల్లాను రాష్ట్ర స్థాయిలో టాప్‌టెన్‌లో నిలపాలన్నారు. గద్వాల నియోజకవర్గంలో కొత్తగా 300 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రొసీడింగ్ అందించడం జరిగిందని, పంచాయతీ ఎన్నికల కోడ్ అమలులో రాకముందే మార్క్ అవుట్ పనులు పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే మంజూరయ్యి నిర్మాణాలకు ఆసక్తి చూపని 1,197 మంది గృహాల స్థానంలో కొత్త వారిని ఎంపిక చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగారావు, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, డీపీవో నాగేంద్రం, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డి, ఇతర ఎన్నికల సంఘం అధికారులతో కలిసి వీసీ నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ బీఎం సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, అడిషనల్ ఎస్పీ శంకర్, డీఎస్పీ మొగులయ్య, డీపీవో నాగేంద్రం, అధికారులు ఉన్నారు.

ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో కమిటీ

- డీఈవో విజయలక్ష్మి



మాట్లాడుతున్న డీఈవో విజయలక్ష్మి

ఎర్రవల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతీ పాఠశాలలో ఓ కమిటీ ఏర్పాటు చేసి అభివృద్ధి పనులను చేపట్టాలని డీఈవో విజయలక్ష్మి సూచించారు. గురువారం ఎర్రవల్లి మండలంలోని కొండేరు జెడ్పీహెచ్ఎస్‌లో ఎర్రవల్లి, ఇటిక్యాల మండలాల హెచ్ఎంలతో సమీక్ష నిర్వహించారు. క్యాంపెయిన్.5.0 కార్యక్రమంలో భాగంగా పలు అంశాలపై చర్చించి అవగాహన కల్పించారు. ప్రతీ పాఠశాలలో శుభ్రతపై దృష్టి సారించాలని, ఉపయోగకరమైన వస్తువులను భద్రపరిచి, నిరుపయోగంగా ఉన్న వాటిని తొలగించేందుకు కమిటీలు ప్రత్యేక చొరవచూపాలన్నారు. పాఠశాల గోడలను సుందరీకరణ, పాక్షికంగా ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హంపయ్య, శాంతిరాజ్, రాజేంద్ర, మహ్మద్ అజాం, అమీర్‌పాష, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆశాలకు యూనిఫామ్ చీరల పంపిణీ



ఆశాలకు చీరలను పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో సంధ్యాకిరణ్మయి

గద్వాల న్యూటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో డీపీహెచ్ఎన్‌వో వరలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం ఆశా కార్యకర్తలకు డీఎంహెచ్‌వో సంధ్యాకిరణ్మయి యూనిఫామ్ చీరలను పంపిణీ చేశారు. జిల్లాలో ఉన్న ఆశాలు తప్పనిసరిగా విధుల్లో ఉన్నప్పుడు యూనిఫామ్ చీరలను ధరించాలన్నారు. జిల్లాలో 604 మంది ఆశాలకు 1,212 చీరలు వచ్చాయని, ఇందులో ఒక్కో ఆశాకు రెండు చీరల చొప్పున పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి ప్రసూనారాణి, మధుసూదన్‌రెడ్డి, శ్యాంసుందర్, డీడీఎం రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సంపత్‌కుమార్ జన్మదినం



ఎర్రవల్లి చౌరస్తాలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎర్రవల్లి/ వడ్డేపల్లి/ అయిజ/ అలంపూరు చౌరస్తా, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఎర్రవల్లిలో కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. అనంతరం బైక్ ర్యాలీగా బీచుపల్లి క్షేత్రానికి చేరుకుని ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వెంకటేష్‌యాదవ్, జోగుల రవి, రుక్మానందరెడ్డి, సోమనాద్రి, వెంకటేష్, అల్లబకాశ్, హుసేన్, జమ్మన్న, జాకీర్, అంజి, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు. శాంతినగర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, వడ్డేపల్లి మునిసిపాలిటీలోని ఐదు, ఆరవ వార్డులకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఆధ్వర్యంలో సంపత్ కుమార్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. అయిజ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప, నర్సింహరెడ్డి, రంగు శ్రీధర్, జయన్న, తిప్పన్న, దేవరాజు, లాలుగౌడు పాల్గొన్నారు. అలంపూరు చౌరస్తాలోని ఏరియా ఆసుపత్రిలో కాంగ్రెస్ నాయకులు శేఖర్, కృష్ణయ్య, దానచంద్రుడు, శేఖర్‌రెడ్డి రోగులను పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

సురేందర్ రెడ్డి సమాజ సేవలు మార్గదర్శకం

గద్వాల టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని విశిష్ట సేవలందించిన బండ సురేందర్‌రెడ్డి పోరాట స్ఫూర్తికి మార్గదర్శకుడయ్యాడని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ అన్నారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆయన అందించిన సేవలు మరచి పోలేనివన్నారు. గురువారం పట్టణంలోని పోరాట సమితి కార్యాలయంలో దివంగత సురేందర్ రెడ్డి చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఆయన మరణం తీరనిలోటని అన్నారు. కారక్రమంలో బుచ్చిబాబు, కార్తీక్, ఆంజనేయులు, సుదర్శన్, విజయ్‌కుమార్ ఉన్నారు.

నేడు చెకుముకి సైన్స్ సంబురాలు

గద్వాల సర్కిల్, నవంబర్ 20 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక, తెలంగాణ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాలలో చెకుముకి సైన్స్ సంబురాలు నిర్వహిస్తున్నట్టు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు రుషిరాజు, ప్రధాన కార్యదర్శి పరంజ్యోతి, చెకుముకి కన్వీనర్ ఎల్లస్వామి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతీ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు పోటీలో పాల్గొనేలా హెచ్ఎం, ఎస్‌వోలు సహకరించాలని కోరారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఈ నెల 28న గద్వాలలో నిర్వహించే జిల్లా స్థాయి పోటీలో పాల్గొనాల్సి ఉంటుందని వివరించారు.

కేటీదొడ్డి వాసికి డాక్టరేట్

కేటీదొడ్డి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బోయ వెంకటన్నకు హైదరాబాద్‌లో ఉస్మానియా విశ్వవిద్యాలయం మైక్రో బయాలజీ డిపార్ట్‌మెంట్ నుంచి డాక్టరేట్ ప్రకటించారు. ఐకార్, ఐఐఆర్ఆర్ ప్రధాన శాస్త్రవేతగా పనిచేస్తున్న పీ.సీ.లత పర్యవేక్షణలో ఉస్మానియ మైక్రో బయాలజీ డిపార్ట్‌మెంట్ శాఖాధిపతి భీమా, సందిప్త, హమిదాబి మార్గదర్శకత్వంలో రూట్ ఆండ్ సాయిల్ మైక్రోబ్ ఇంటరాక్షన్ ఇన్ సిస్టమ్ ఆఫ్ రైస్ ఇంటెన్సిఫికేషన్ ఎఫెక్ట్ ఆన్ న్యూట్రియంట్ ఆప్టెక్ అండ్ ఇల్డ్ అనే అంశంపై పరిశోధన సమర్పించినందుకు బోయ వెంకటన్నకు డాక్టరేట్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అభినందించారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

గద్వాల టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన వారోత్సవాలు గురువారం ముగిశాయి. ముగింపు సందర్భంగా చైర్మన్ శ్రీనివాసులు, అతిథులతో కలిసి సర్వస్వతీదేవి చిత్రపటానికి పూలమాలల వేసి పూజలు చేశారు. వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్, ముగ్గుల పోటీల్లో విజేతలైన వారికి బహుమతులతో పాటు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయం అధికారి రామాంజనేయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల వద్ద ప్రధాని ఫొటో పెట్టాలి: బీజేపీ

ఎర్రవల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ఫ్లెక్సీలలో ప్రధాని నరేంద్రమోడీ ఫొటో పెట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని కొండేరు కొనుగోలు కేంద్రాన్ని నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు. కేంద్రాల్లో ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వం కొంటుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఎలాంటి ప్రోటోకాల్ పాటించకుండా తామే కొంటున్నామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని అన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జనవరి నుంచి సెప్టెంబరు వరకు నేర సమీక్ష సమావేశం డీసీపీ శివధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా నేర పరిస్థితులు, కేసుల విచారణ, పురోగతి, శాంతిభద్రతా చర్యలు, మహిళా శిశు భద్రత, సైబర్ నేరాల నియంత్రణ తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. పెండింగ్ కేసులను సత్వరంగా పరిష్కరించేలా కృషి చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. అనంతరం ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రజల భద్రతే ప్రాధాన్యంగా ఎన్‌హెచ్ 44ను ఆనుకొని ఉన్న గ్రామాలలో విలేజ్ రోడ్డు సేఫ్టీ కమిటీలను ఏర్పాటుతో పాటు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ శంకర్, డీఎస్పీ మొగులయ్య, సీఐలు ఉన్నారు.

జోనల్ స్థాయి క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కేటీదొడ్డి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు జరిగిన ఉమ్మడి జిల్లాలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు సంబంధించిన క్రీడల్లో కేటీదొడ్డి గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు గురువారం ప్రిన్సిపాల్ కే.శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. అండర్-17 అథ్లెటిక్స్ చాంపియన్ షిప్, అండర్-17 వంద మీటర్లు మొదటి స్థానం, 200 మీటర్లు మొదటి స్థానం, 400 మీటర్లు రెండవ స్థానం, లాంగ్‌జంప్ ప్రథమ, ద్వితీయ స్థానం, హైజంప్ ప్రథమ స్థానం, అండర్-14 చెస్ విన్నర్, అండర్-14 వాలీబాల్ విన్నర్‌లుగా నిలిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పీడీ, పీఈటీ రవి, రమ్య అభినందించారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



జాతీయ స్థాయి ఎంపికపత్రం అందుకుంటున్న ఉమేశ్

వడ్డేపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన బోయ ఉమేశ్ సత్తాచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. చౌటుప్పల్‌లోని ఎంజేపీ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఈయన, హైదరాబాదు జట్టు తరపున పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. జాతీయ స్థాయిలో రాణించాలని ఈ సందర్భంగా గ్రామస్థులు అభినందించారు.

అయిజ సింగిల్ విండోకు అవార్డు



ఎండీ అన్నపూర్ణ నుంచి అవార్డు అందుకుంటున్న అధ్యక్షుడు పోతుల మధుసూదన్‌రెడ్డి

అయిజ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సింగిల్‌విండోకు గురువారం అవార్డు దక్కింది. ఆరుగురు సిబ్బందితో ఉన్న సింగిల్‌విండోను 23 మంది సిబ్బందికి పెంచి అభివృద్ధి చేస్తూ రైతులకు సహకారం అందిస్తున్నారు. దాదాపు రూ. 3 కోట్లు నష్టాలలో కూరుకుపోయిన సంఘాన్ని లాభాల బాటలో చేర్చారు. ఐదేళ్ల కాలంలో ఉద్యోగుల జీతభత్యాలు, హమాలి, రవాణ, ఆఫీసు నిర్వాహణ, అన్ని రకాల ఖర్చులు పోను రూ. 2.18 కోట్ల లాభాన్ని సమకూర్చి ఉమ్మడి జిల్లాలోని 15 సొసైటీలలో ముందంజలో నిలిచింది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని తక్కువ సమయంలో అన్ని ప్రమాణాలతో కూడిన అభివృద్ధి సాధించినందుకు గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర సహకార యూనియన్ కార్యాలయంలో ఎండీ అన్నపూర్ణ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నారు. సిబ్బంది సహకారంతోనే సాధ్యమైందని అధ్యక్షుడు పోతుల మధుసూన్‌రెడ్డి తెలిపారు.

చేనేత కార్మికుల సమస్యలపై కేటీఆర్‌కు వినతి



కేటీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజోలి చేనేత కార్మికులు

రాజోలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజోలిలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ మాజీ మంత్రి కేటీఆర్‌కు రాజోలి చేనేత కార్మికులు గురువారం వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని కేటీఆర్ నివాసంలో ఎమ్మెల్సీ చల్లా వెంకటరామరెడ్డి ఆధ్వర్యంలో చేనేత కార్మికులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్ రెడ్డి, బండ శివ, మోని వెంకటేష్, దస్తగిరి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత రుణమాఫీ చేయాలని కోరుతూ హైదరాబాద్ చేనేత జౌళి శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట నిర్వహించే మహాధర్నాకు మండల కేంద్రం నుంచి గురువారం చేనేత కార్మికుల అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

దేవాలయాల్లో అమావాస్య పూజలు



వీరభద్ర ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

గద్వాల టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కార్తీక బహుళ అమావాస్యను పురస్కరించుకుని గురువారం పట్టణంలోని దేవాలయాల్లో భక్తులు పూజలు చేశారు. కార్తీక మాసం చివరిరోజు కావడంతో భక్తులు దీపాలు వెలిగించి సంధ్యావందనం నిర్వహించారు. స్థానిక వీరభద్రస్వామి, భక్తమార్కండేయ, పాండురంగ శివాలయం, అంబాభవానీ, కాళికాదేవి, అన్నపూర్ణేశ్వరి, నందీశ్వర ఆలయాల్లో సాయంత్రం భక్తులు దీపాలు వెలిగించారు. రాతిబురుజు ఆంజనేయ స్వామి, తెలుగుపేట శివాలయం, నదీ అగ్రహారం రోడ్డులోని హనుమాన్ ఆలయాల్లో భక్తులు అమావాస్య పూజలు చేశారు.

ఆంజనేయస్వామి ఆలయంలో..

రాజోలి: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం తుంగభద్ర నది నుంచి నీటిని తీసుకొచ్చి అభిషేకాలు, ఆకుపూజ, మహామంగళ హారతి చేశారు.

ఆందోళనలో భాగస్వామ్యం కావాలి

- రైతాంగ సమితి రాష్ట్ర కార్యదర్శి గోపాల్



పోస్టర్లను విడుదల చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

గద్వాల టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 26న జిల్లా కేంద్రంలో నిర్వహించే ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ యాదవ్ పిలుపునిచ్చారు. కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు సాగుతున్న ఆందోళనలో కార్మికులు, రైతులు, ప్రజాస్వామికవాదులు, విద్యావంతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. పోస్టర్లను గురువారం పట్టణంలోని టీజేఎస్ కార్యాలయంలో విడుదల చేశారు. ప్రకాష్‌గౌడ్, ప్రభాకర్, మల్లేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

అలంపూర్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 26న జరిగే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ, దేవదాసు, ఈదన్న పిలుపునిచ్చారు. టూరిజం హోటల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈమేలమ్మ, జయరాములు, లక్ష్మన్న, ప్రభుదాస్ పాల్గొన్నారు.